క్లుప్తంగా

ఉచిత సంగీత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

తాటిచెట్లపాలెం: స్థానికంగా ఉన్న మాస్టర్ ఇ.కె. సంస్కృతీ సదన్ సంగీత జనకులం ఆధ్వర్యంలో ఉచితంగా కర్ణాటక సంగీతం, గాత్ర, వాయిద్య సంగీతం, వేదాభ్యాసాలలో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంగీత జనకులం అధ్యక్షుడు ఇంద్రగంటి కాశీప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణ తరగతులలో చేరదలచుకున్న వారు ఏప్రిల్ 27వ తేదీ ఉదయం 9 గంటల లోగా సంప్రదించాలని కోరారు. మొత్తం నాలుగు విభాగాలుగా ఈ శిక్షణ ఉంటుందన్నారు. చేపట్టనున్నారు. మొదటి విభాగంలో సంవత్సరం శాస్త్రీయ సంగీత అవగాహన తరగతులు, రెండవ విభాగంలో వాయిద్య సంగీతం, వేణుగాన సంగీత శిక్షణ, మూడవ విభాగంలో ఐదు సంవత్సరాల గాత్ర, సంగీత తరగతులు, నాలుగవ విభాగంలో వేదాభ్యాసంలో భాగంగా మాస్టర్ ఇ.కె. అందించిన నిత్య షోడశోపచార పూజా విధానంలోని ఋగ్వేద సూక్తాలలో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు సంస్కృతి సదన్ సంగీత జనకులం కార్యాలయంలో స్వయంగా గానీ లేదా 93983 14502 నంబర్‌లో గానీ సంప్రదించాలని కోరారు.

అందరికీ వాకర్స్ క్లబ్ సభ్యత్వం



సమావేశంలో తీర్మానం ప్రవేశపెడుతున్న క్లబ్ అధ్యక్షుడు భానుప్రకాష్

మురళీనగర్: వాకర్స్ అందరికీ వాకర్స్ క్లబ్‌లో సభ్యులుగా చేరేందుకు అవకాశం కల్పిస్తున్నామని వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు సనపల భాను ప్రకాష్ తెలిపారు. మురళీనగర్ వాకర్స్ క్లబ్ ప్రత్యేక సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్‌లో చేరడానికి ప్రస్తుతం ఉన్న శాశ్వత సభ్యత్వ రుసుమును రూ.5,000 నుంచి రూ.3,000కు తగ్గిస్తూ ఆయన తీర్మానం ప్రవేశపెట్టగా, కార్యవర్గ సభ్యులు ఓటింగ్ ద్వారా ఆమోదించారు. దీని వల్ల సంస్థలో సభ్యుల సంఖ్య పెరగడమే కాకుండా సభ్యత్వ రుసుము అందరికీ అందుబాటులో ఉంటుందని వక్తలు పేర్కొన్నారు. సభ్యత్వ నమోదుకు కార్యాలయంలో సంప్రదించాలని భానుప్రకాష్ సూచించారు. వివరాలకు 7659804633, 9491292369 ఫోన్ నంబర్లలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో క్లబ్ పూర్వ అధ్యక్షులు ఎన్.బుచ్చయ్య, ఎ.రామకృష్ణారెడ్డి, కార్యదర్శి సీహెచ్ ప్రసాదరావు, ఉపాధ్యక్షురాలు విజయలక్ష్మి, సహాయకార్యదర్శి ఎస్.ప్రకాశరావు, జాలీ వాకర్ ఎస్.మాధవి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి నగదు బహుమతి


విద్యార్థికి నగదు బహుమతి అందజేస్తున్న ఆచార్య నాగేశ్వరరావు

సీతంపేట: భారతీయ విద్యా కేంద్రం (బీవీకే) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 12 ఉన్నత పాఠశాలల్లో టెన్త్ విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించారని విద్యా కేంద్రం చైర్మన్ ఆచార్య గొల్లపల్లి నాగేశ్వరరావు తెలిపారు. స్థానిక బీవీకే కళాశాలలో శుక్రవారం నిర్వహించిన అభినందన సభలో ఆయన పాల్గొన్నారు. టెన్త్‌లో 592 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచిన గాజువాక విజ్ఞాన భారతి ఉన్నత పాఠశాల విద్యార్థి సాయి భరద్వాజ్ తల్లిదండ్రులను సత్కరించి రూ.5వేలు నగదు బహుమతి అందించారు. ఆయన మాట్లాడుతూ 12 పాఠశాలల నుంచి 231 మంది టెన్త్ పరీక్షలకు హాజరు కాగా, 203 మంది ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించారని, 111 మంది 500కు పైగా మార్కులు సాధించారని తెలిపారు. కార్యక్రమంలో బీవీకే కార్యదర్శి వేదనభట్ల రామ సత్యనారాయణ, కార్యనిర్వహణాధికారి ఏవీఎస్ ఆచార్యులు తదితరులు పాల్గొన్నారు.

క్రైం పోలీస్ స్టేషన్‌లో ఏడీసీపీ విచారణ

సాక్షి ఎఫెక్ట్..

సీతమ్మధార: నాలుగవ పట్టణ క్రైం పోలీస్‌స్టేషన్‌లో సిబ్బంది చేతివాటంపై క్రైం ఏడీసీపీ మోహనరావు శుక్రవారం ఫోర్త్‌టౌన్ క్రైం పోలీస్‌స్టేషన్‌ని సందర్శించారు. 'సాక్షి' దినపత్రికలో గురువారం 'కాసుల వేటలో పోలీసులు?' శీర్షికన వార్త ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఏడీసీపీ మోహనరావు ఎస్‌ఐతో పాటు సిబ్బందిని విచారించారు. అదే విధంగా పెండింగ్ కేసులపై ఆరా తీసి పలు అంశాలను పరిశీలించారు.


2022లో తారకరామానగర్‌లోని ఖాళీ స్థలంలో సామాజిక భవనం కోసం ప్రతిపాదిస్తున్న కార్పొరేటర్ కంపా హనోకు (ఫైల్)

నాడే కేటాయింపులు.. నేడు శంకుస్థాపనలు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అనేక అభివృద్ధి పనుల మంజూరు

నాడు ఎన్నికల కోడ్ కారణంగా నిలిపివేత

ఆ పనులు తమ ఘనతేనంటూ కూటమి నేతల హడావుడి

తాటిచెట్లపాలెం: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అనేక అభివృద్ధి పనులకు బాటలు పడ్డాయి. అవి చాలా వరకు కార్యరూపం దాల్చి, పూర్తయ్యాయి. ఇలా పూర్తయిన వాటిలో అత్యాధునిక బస్ బేలు, ఓపెన్ జిమ్‌లు, సుందరమైన రహదారులు, ప్రధాన కూడళ్ల వంటివి ఉన్నాయి. అయితే గతేడాది ఎన్నికల కోడ్ కారణంగా ఇలా మంజూరైన పనుల్లో చాలా వరకు వాయిదా పడ్డాయి. మరికొన్ని ప్రారంభించి కొనసాగిస్తున్నారు. వీటిలో ప్రధానంగా రోడ్లు, డ్రైనేజీలు, గెడ్డల ఆధునికీకరణ, ఫుట్‌పాత్‌లు వంటి పనులు నేటికీ పలు ప్రాంతాల్లో కొనసాగుతున్నాయి. ఇలా కేటాయింపులు జరిగిన చాలా పనులకు ఇటీవల కాలంలో కూటమి నేతలు శంకుస్థాపనలు చేస్తున్నారు. అంతవరకు బాగానే ఉన్నా.. గత ప్రభుత్వ హయాంలో జీవీఎంసీ పరిధిలో ఏ అభివృద్ధి జరగలేదని, ఇప్పుడు చేసే అభివృద్ధి అంతా తమ ఘనతేనంటూ కూటమి నేతలు చెప్పుకుంటున్నారు. వాస్తవానికి ఈ పనులకు నాడే మంజూరులు, కేటాయింపులు జరిగినట్లు స్పష్టంగా తెలుస్తోంది.


ఇటీవల తారకరామానగర్‌లో శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, కంపా హనోకు

45వ వార్డులో..

జీవీఎంసీ 45వ వార్డు వైఎస్సార్ నగర్‌లో మార్చి 18న కార్పొరేషన్ నిధులు రూ.20 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజీల పనులకు కూడా ఎమ్మెల్యే కుమార్తె శ్యామలదీపిక, స్థానిక కార్పొరేటర్ కంపా హనోకు, కూటమి నాయకులు శంకుస్థాపన చేశారు.

● ఇదే వార్డు తాటిచెట్లపాలెం హైవే సమీపంలోని ఆంజనేయ స్వామి ఆలయం పక్కనే గల తారకరామానగర్‌లో నిరుపయోగంగా ఉన్న పార్క్ స్థలంలో సామాజిక భవనం నిర్మించేందుకు ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, కార్పొరేటర్ కంపా హనోకులు శంకుస్థాపన చేసారు. ఇక్కడి పార్క్ స్థలంలో స్థానికులకు ఉపయోగపడేలా సామాజిక భవనం నిర్మించాలని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో 17 నవంబర్ 2022లో కార్పొరేటర్ కంపా హనోకు, నాటి వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు సహకారంతో జీవీఎంసీ అధికారులకు ప్రతిపాదనలు పంపించారు. అప్పట్లోనే ఇది మంజూరు చేయించడం జరిగింది. ఇలా అప్పుడు మంజూరైన, కేటాయించిన పనులకు ఇప్పుడు శంకుస్థాపనలు చేస్తుంటే.. అసలు విషయం తెలియని కొందరు నాయకులు ఈ ఘనతంతా తమ కూటమి నేతలదేనని చెప్పుకుంటూ హడావిడి చేస్తున్నారు. వాస్తవానికి కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఇప్పటివరకు కొత్తగా అంతంత మాత్రమే అభివృద్ధి పనులు మంజూరయ్యాయి. ఇది వరకు మంజూరైన పనులకే కొత్తగా శంకుస్థాపనలు చేస్తూ గొప్పగా ప్రచారం చేసుకుంటున్నారు.

42వ వార్డులో..

జీవీఎంసీ 42వ వార్డు రైల్వే న్యూకాలనీ మసీదు రోడ్డు బజార్ వద్ద మార్చి 19న పలు అభివృద్ధి పనులకు కార్పొరేటర్ ఆళ్ల లీలావతి, జీవీఎంసీ అధికారులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఇక్కడ ఏ అధికారం లేని ఉత్తర ఎమ్మెల్యే పి.విష్ణు కుమార్‌రాజు కుమార్తె శ్యామలదీపిక ఈ శంకుస్థాపన చేయడం గమనార్హం. ఈ ప్రాంతంలో జీవీఎంసీ నిధులు రూ.20 లక్షలతో బాక్స్ కల్వర్టు, ఫుట్‌పాత్ టైల్స్ నిర్మించనున్నట్లు ఆ సమయంలో జీవీఎంసీ అధికారులు తెలిపారు. వీటికి సంబంధించిన నిధుల మంజూరు, పనుల కేటాయింపులు ఎన్నికలకు ముందే జరిగినట్లు అధికారులు వెల్లడించారు.

● మార్చి 12న కూడా ఇదే వార్డులోని అక్కయ్యపాలెం జగన్నాథపురం, మూడు గుళ్ల జంక్షన్ వద్ద సుమారు రూ.19 లక్షలతో డ్రైనేజీలు, ఫుట్‌పాత్ టైల్స్, కవర్డ్ శ్లాబ్స్ పనులకు ఎమ్మెల్యే కుమార్తె, కూటమి నేతలు కలిసి శంకుస్థాపన చేశారు.


42వ వార్డులో పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కుమార్తె శ్యామలదీపిక (ఫైల్)

ఉత్సాహంగా క్విజ్ పోటీ


విజేతలతో క్విజ్ మాస్టర్ డి.వి.సూర్యారావు

సీతంపేట: ద్వారకానగర్‌లోని విశాఖ పౌర గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు శుక్రవారం క్విజ్ పోటీ నిర్వహించారు. పౌర గ్రంథాలయం సొసైటీ నిర్వహించిన ఈ పోటీలకు గ్రంథాలయ సహాయ కార్యదర్శి డాక్టర్ డి.వి.సూర్యారావు క్విజ్ మాస్టర్‌గా వ్యవహరించారు. వర్తమాన అంశాలు, ఆర్థిక వ్యవస్థ, చరిత్ర, రాజ్యాంగం, విజ్ఞాన సాంకేతిక శాస్త్రాలు, భూగోళ శాస్త్రంపై క్విజ్ పోటీ జరిగింది. పోటీలో 60 మంది విద్యార్థులు ఏడు బృందాలుగా పాల్గొన్నారు. ఏడు రౌండ్లలో జరిగిన పోటీలో గెలుపొందిన విద్యార్థులకు పుస్తకాలను బహూకరించారు. ప్రధాన గ్రంథ పాలకురాలు దుర్గారాణి పర్యవేక్షించారు.

మలేరియా నిర్మూలనే లక్ష్యం


ర్యాలీలో పాల్గొన్న వైద్యులు, సిబ్బంది

సీతంపేట: ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీలో గల విద్యుత్‌నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్యులు సుధీర్, మధుమిత ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీలో హెల్త్ సెక్రటరీలు, ఆశ కార్యకర్తలు, మలేరియా విభాగం సూపర్‌వైజర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ 2027 నాటికి మలేరియాను నిర్మూలించాలని వైద్యారోగ్యశాఖ లక్ష్యంగా నిర్ణయించిందని, దానికి అనుగుణంగా ప్రతి ఒక్కరూ పనిచేసి మలేరియా కేసుల సంఖ్యని తగ్గించాలని కోరారు. ఫ్రైడే డ్రైడేను సమర్థవంతంగా నిర్వహించడం ద్వారా దోమల ఉత్పత్తిని తగ్గించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు సతీష్, కేఎస్‌వీ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కేకే రాజుకు శుభాకాంక్షలు


కేకే రాజుకు అభినందనలు తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

సీతమ్మధార: వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన పార్టీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కేకే రాజుకు శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. సీతమ్మధార ఎంఎంటీసీలోని ఆయన కార్యాలయంలో 45, 55, 24, 43 వార్డుల నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. 55వ వార్డు వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు యడ్ల శ్రీనివాస్ రెడ్డి, నూనెల పోలారావు, జి.ఆర్కె.రాజు, నార్త్ లీగల్ సెల్ ప్రెసిడెంట్ బోర పరదేశి రెడ్డి, నార్త్ సోషల్ మీడియా కో-కన్వీనర్ పాట్నూరు చందన్ సాయి తదితరులు శుభాకాంక్షలు తెలియజేశారు. 24వ వార్డు నాయకుడు కర్రి మురళీకృష్ణారెడ్డి కేకే రాజును కలిసి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో 45వ వార్డు అధ్యక్షుడు పైడి రమణ, హరి పట్నాయక్, దుర్గేశ్వర్ రావు, సన్ని, నానీబాబు, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్లకు సర్టిఫికెట్ల అందజేత


క్యాడెట్లను అభినందిస్తున్న హెచ్‌ఎం లక్ష్మీనరస

సీతంపేట: అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ ఉన్నత పాఠశాలకు చెందిన 2023–25 బ్యాచ్ పదవ తరగతి విద్యార్థులకు ఎన్‌సీసీ శిక్షణ పూర్తి కావడంతో సర్టిఫికెట్లు అందజేశారు. 11 ఆంధ్రా ట్రూప్ కమాండర్ చీఫ్ ఆఫీసర్ ఎం.ఎస్.వి.విశ్వనాథం ఆధ్వర్యంలో శిక్షణ పూర్తి చేసుకున్న 15 మంది క్యాడెట్లకు కల్నల్ ఆజయ్‌కుమార్ చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేశారు. పాఠశాలలో పదవ తరగతిలో ప్రతిభ చూపిన ఎన్‌సీసీ క్యాడెట్ అమలాపురం దినేష్‌కు రూ.6 వేల చెక్ అందజేశారు. ఈ సందర్భంగా విశ్వనాథం మాట్లాడుతూ విశాఖ జిల్లాలో ఎన్సీసీ ఉన్న ఏకైక జీవీఎంసీ పాఠశాలలో మొదటి బ్యాచ్ శిక్షణ పూర్తి చేసుకుందన్నారు. సర్టిఫికెట్లు అందుకున్న క్యాడెట్లను స్కూల్ హెచ్‌ఎం లక్ష్మీనరస అభినందించారు. ఈ కార్యక్రమంలో సుబేదార్ మేజర్ జయప్రకాష్, హవల్దార్ శ్యామలరావు, పాఠశాల పేరెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అప్పలరాజు పాల్గొన్నారు.

బోర్లకు మరమ్మతులు


అరుంధతినగర్‌లో మంచినీటి బోరుకు ప్లేట్లు అమర్చిన దృశ్యం


ఐటీఐ సిద్ధార్థనగర్‌లో బోరుకు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

కంచరపాలెం: జీవీఎంసీ జోన్–5 పరిధిలో పాడైన బోర్లకు సిబ్బంది శుక్రవారం మరమ్మతులు చేశారు. జీవీఎంసీ 47, 54, 55 వార్డుల్లోని రాంజీ ఎస్టేట్, కప్పరాడ, అరుంధతినగర్, అంబేడ్కర్ ఎస్టేట్, సంజీవయ్య కాలనీ, బాపూజీనగర్, సిద్ధార్థనగర్, ఐటీఐ జంక్షన్, గజపతినగర్, ఊర్వశికూడలి గౌరీనగర్, తుమ్మడపాలెం తదితర ప్రాంతాల్లో వీధి బోర్లు సక్రమంగా పనిచేయకపోవడంతో స్థానికులు ఇబ్బంది పడేవారు. ఈ సమస్యపై ఈ నెల 23న సాక్షి దినపత్రికలో 'బోరు' మంటున్నారు శీర్షికతో ప్రచురితమైన కథనంపై జోన్–5 మంచినీటి విభాగం ఏఈ సుమన్ స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు వర్క్ ఇన్‌స్పెక్టర్లు ప్రసాద్, కాళిదాస్, చైతన్య పర్యవేక్షణలో ఆయా ప్రాంతాల్లో బోర్లకు శుక్రవారం సిబ్బంది మరమ్మతులు చేపట్టి, బోర్లను వినియోగంలోకి తెచ్చారు.

మద్యం దుకాణం ఏర్పాటు అడ్డగింత


స్థానికులతో వాగ్వివాదం చేస్తున్న పోలీసులు

కంచరపాలెం: జనవాసాల మధ్య మద్యం దుకాణం వద్దని కంచరపాలెం ఇందిరానగర్ కాలనీ వాసులు ఆందోళనకు దిగారు. కంచరపాలెం జాతీయ రహదారికి ఆనుకుని సబ్‌వే పక్కన శుక్రవారం ఓ టిఫిన్ దుకాణంలో ఎస్వీఆర్ వైన్స్ పేరుతో మద్యం దుకాణాన్ని ప్రారంభించడానికి ప్రయత్నాలు జరిగాయి. దీంతో మద్యం దుకాణం వద్ద ఇందిరానగర్–5 కాలనీ వాసులు నిరసన చేపట్టారు. జనవాసాలు, ఆలయాల దగ్గరలో నిబంధనలకు విరుద్ధంగా మద్యం దుకాణం ఎలా పెడతారని ఆందోళ చేశారు. టిఫిన్ దుకాణంలో మద్యం బాటిళ్లు పెడుతుండడంతో స్థానికులు గొడవకు దిగారు. మద్యం బాటిళ్లు తిరిగి లారీలోకి ఎక్కించేంత వరకు ఆందోళన విరమించలేదు. సమాచారం అందుకున్న కంచరపాలెం పోలీసులు జోక్యం చేసుకోవడంతో ఆందోళన సద్దుమణిగింది. స్థానిక నాయకుడు ధర్మాల ఆనందకుమార్‌రెడ్డి మాట్లాడుతూ జనావాసాల మధ్య మద్యం దుకాణం ఏర్పాటు చేస్తే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని తెలిపారు.

ఉగ్రదాడిపై ముస్లింల నిరసన


ఉగ్రదాడిని నిరసిస్తూ ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు


యాసీన్ మసీద్ వద్ద నివాళులర్పిస్తున్న ముస్లింలు

తాటిచెట్లపాలెం: జమ్మూ కశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడిని నిరసిస్తూ 53వ వార్డు పరిధి జాకీర్ హుస్సేన్ నగర్ మస్జిద్ ఈ అల్ ఖదీర్ ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. అమాయకులను కిరాతకంగా చంపిన దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మస్జిద్ ప్రాంగణంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

యాసీన్ మసీదు ఆధ్వర్యంలో..

సీతంపేట: స్వర్ణభారతి స్టేడియం సమీపంలో గల యాసీన్ మసీదు ఆధ్వర్యంలో శుక్రవారం మధ్యాహ్నం జుమా నమాజ్ అనంతరం ముస్లింలంతా నిరసన చేపట్టారు. కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో పర్యాటకులపై జరిగిన దాడిలో మరణించిన వారికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్లకార్డులు, ఫ్లెక్సీలు పట్టుకుని నినాదాలు చేస్తూ ఉగ్రవాద చర్యలను ఖండించారు. హిందూ, ముస్లింల ఐక్యత వర్ధిల్లాలని నినాదాలు చేశారు. ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని అల్లాను ప్రార్థించారు. యాసిన్ మసీద్ గౌరవ అధ్యక్షుడు ఐ.హెచ్.ఫరూఖీ మాట్లాడుతూ ఉగ్రవాదులకు మతం అంటూ లేదని, అటువంటి దాడులకు పాల్పడిన వారిని, ఆ సంఘటనకు పురిగొల్పిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశా రు. ఇస్కాఫ్ నాయకులు దేవరకొండ మార్కండేయులు మాట్లాడుతూ మరణించిన కుటుంబాలకు ప్రభుత్వాలు, ప్రజలు బాసటగా నిలవాలన్నారు. విశాఖ జిల్లా మాస్కో అధ్యక్షుడు అహ్మదుల్లా ఖాన్, యాసిన్ మసీదు సెక్రటరీ సయ్యద్ మొహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాటిచెట్లపాలెం: అక్కయ్యపాలెం సెక్షన్ పరిధిలో చేపడుతున్న చెట్ల కొమ్మల తొలగింపు, పలు నిర్వహణ పనుల నిమిత్తం శనివారం దిగువ తెలిపిన ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ జోన్–1, ఈఈ బి. సింహాచలం నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు.

ఎన్జీజీవోస్ కాలనీ, పద్మశ్రీ ఆస్పత్రి ప్రాంతం, కిన్నెర మెస్ ఎదురుగా గల ప్రాంతం, విద్యుత్ నగర్ ప్రాంతాల్లో ఉదయం 9 నుండి మధ్యాహ్నం 1.30 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు సహకరించాల్సిందిగా కోరారు.

ప్రశాంతంగా ఏపీఆర్‌జేసీ సెట్

సీతంపేట: అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీలోని జీవీఎంసీ హైస్కూల్లో శుక్రవారం ఏపీఆర్‌జేసీ సెట్ –2025 ప్రవేశ పరీక్ష నిర్వహించారు. 240 మంది విద్యార్థులను పరీక్షా కేంద్రానికి కేటాయించగా, 204 మంది పరీక్షకు హాజరైనట్టు స్కూల్ హెచ్‌ఎం లక్ష్మీ నరస తెలిపారు. పరీక్ష ప్రశాంతంగా జరిగిందన్నారు.

ఉత్సాహంగా రీజినల్ బాస్కెట్ బాల్ మీట్

తాటిచెట్లపాలెం: స్థానిక కేంద్రీయ విద్యాలయ, వాల్తేర్‌లో అండర్ –17 ప్రాంతీయ స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలు ఘనంగా జరుగుతున్నాయి. వీటిలో భాగంగా శుక్రవారం హకీంపేటపై బేగం పేట విద్యార్థులు గెలిచి ట్రోఫీ కైవసం చేసుకున్నారు. ప్రిన్సిపాల్ కమల్‌జీత్ చేతుల మీదుగా ఈ ట్రోఫీను అందజేసారు. ఈ సందర్భంగా కమల్‌జీత్ మాట్లాడుతూ మొత్తం 7 టీములు పోటీల్లో పాల్గొన్నాయని తెలిపారు. 27వ తేదీన ఫైనల్స్ జరుగుతాయని అన్నారు. ముఖ్య అతిథి, విశాఖ బాస్కెట్‌బాల్ సెక్రటరీ పి. భూషణ రావు విజేతలకు మెడల్లు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో పి.టి. మాస్టర్ రియాజ్‌ఖాన్, గిరి, రాణి, ప్రధానోపాధ్యాయురాలు శైలజ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

మహిళలకు మేలు చేసే ఉపాధి శిక్షణ తరగతులు


ప్రశంసాపత్రాలతో శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలు

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ పీటర్స్ చర్చి ఆవరణలోని జ్యోతి నిలయంలో డాన్‌బాస్కో నవజీవన్ సంస్థ మహిళలకు అందించిన ఉచిత టైలరింగ్ శిక్షణ శుక్రవారం ముగిసింది. ముఖ్య అతిథిగా పునీత పేతురు దేవాలయం రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్‌ప్రకాష్ హాజరై మాట్లాడారు. మహిళలు ఉన్నతంగా ఎదిగేందుకు ఇలాంటి ఉపాధి శిక్షణ తరగతులు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. టైలరింగ్ పూర్తి చేసిన మహిళలు స్వయం ఉపాధి మార్గాలను ఎంచుకోవాలని హితవు పలికారు. డాన్ బాస్కో నవజీవన్ సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. వేసవిలో చిన్నారులకు మరిన్ని ఉచిత శిక్షణ సేవలు అందించాలని సంస్థ సభ్యులను కోరారు. అనంతరం శిక్షణ పూర్తి చేసిన శిక్షకులకు ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమంలో ఫాదర్లు పి.అరుణ్‌దాస్, ఇగ్నేషియస్, సంస్థ సమన్వయకర్త సిస్టర్ పెర్లే, శిక్షకురాలు అనిత, క్రాంతి, సతీష్, పీఆర్‌వో కోరాడ బాలమణి పాల్గొన్నారు.

కొత్త పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు


నూతన పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న విద్యుత్‌శాఖ అధికారులు

తాటిచెట్లపాలెం: వేసవిలో విద్యుత్ అంతరాయం లేకుండా ఉండేందుకు పలు ప్రాంతాల్లో పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. దీనిలో భాగంగా మర్రిపాలెం సెక్షన్ 33/11 కేవీ వుడా లేవుట్ సబ్‌స్టేషన్‌నందు శుక్రవారం 5 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జోన్ 2 డీఈఈ బి.కె. నాయుడు, డీఈఈ(లైన్స్, కంచరపాలెం) జి.ఎస్ సత్యనారాయణ, మర్రిపాలెం ఏఈ లలితాదేవి, సెక్షన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.